సాక్షి ఆదిలాబాద్

శనివారం, 5, ఆగస్టు, 2023



పింఛన్ కోసం ఎదురుచూపు

అర్హులకు వితంతు పింఛన్ ఏళ్లుగా అందడం లేదు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన వారంతా ఆసరా కోసం నిరీక్షిస్తున్నారు.

9లో▸

గిరిజన బాలుడి మృతిపై విచారణ



వైద్యం అందక మూడేళ్ల గిరిజన బాలుడు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు అధికారులు ఘటనపై విచారణ చేపట్టారు.

10లో▸

గరిష్టం/కనిష్టం

31.0 /25.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు నిలకడగా ఉంటాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

10నుంచి రేషన్ బియ్యం

కైలాస్‌నగర్: జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు గమనించాలని సూచించారు.

పెండింగ్ పనులు గడువులోపు పూర్తి చేయాలి

ఇంద్రవెల్లి: ముత్నూర్ గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ కుషబూ గుప్తా సూచించారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామాన్ని ఆమె సందర్శించారు. ముందుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్న గ్రామపంచాయతీలకు సంబంధించి నాలుగేళ్ల అభివృద్ధి, రికార్డులు పరిశీలించారు. అనంతరం మండలాధికారులతో సమావేశమై అభివృద్ధి పనులు, పారిశుధ్యం తదితర వివరాలు తెలుసుకున్నారు. ముత్నూర్ గ్రామంలో చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 అవార్డులో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. వారంరోజుల్లో గ్రామంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. డీపీవో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గణపతి, అదనపు పీడీ రవీందర్ రాథోడ్, డీఎల్పీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు మొదటి కానుక



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి మిల్కా

ఆదిలాబాద్‌టౌన్: తల్లిపాలే బిడ్డకు మొదటి కానుక అని జిల్లా సంక్షేమాధికారి మిల్కా పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలరక్షణ భవనంలో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలని సూచించారు. డబ్బా పాలు పడితే పిల్లలు అనారోగ్యం బారిన పడతారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు అన్ని కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డీసీపీవో రాజేంద్రప్రసాద్, డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్, డీహెచ్‌ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ యశోద, సీడీపీవో సౌందర్య, వనజ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కళ్ల కలకపై ఆందోళన వద్దు



నిల్వ నీటిని పారబోయిస్తున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: కళ్ల కలకపై భయాందోళన వద్దని, ప్రతీ పీహెచ్‌సీలో మందులు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి డ్రైడే నిర్వహించారు. కాలనీలో పర్యటించి నిల్వ నీటిని పారబోయించారు. డ్రైనేజీల్లో పూడికతీత పనులు పరిశీలించి పారిశుధ్య కార్మికులకు సూచనలు చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. మంగళ, శుక్రవారాలు డ్రైడే పాటించాలని సూచించారు. జిల్లా మలేరియా నివారణాధికారి మెట్‌పెల్లివార్ శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పొగాకు రహితంగా మార్చాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: విద్యాసంస్థలను పొగాకు రహితంగా మార్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్‌రాథోడ్ సూచించారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి జూమ్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలల ఎదుట, పరిసర ప్రాంతాల్లో గుట్కా, సిగరెట్లు విక్రయించకుండా చూడాలన్నారు. జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారి శ్రీధర్ తదితరులున్నారు.

కొత్త కిక్కు..!



- ఎక్సైజ్ పాలసీ గెజిట్ విడుదల
- జిల్లాలో 40 మద్యం షాపులు
- 15 దుకాణాలకు రిజర్వేషన్లు
- 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 21న లక్కీడ్రా ద్వారా కేటాయింపు

ఆదిలాబాద్‌టౌన్: ఎక్సైజ్ పాలసీ గెజిట్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో 40 మద్యం షాపులకు టెండర్లు స్వీకరించనుంది. ఇందుకోసం ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారమే ప్రక్రియ ప్రారంభం కాగా మొదటిరోజు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఈ నెల 18వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. జిల్లాలో మొత్తం 40 షాపులకు గాను 15 షాపులకు రిజర్వేషన్లు కేటాయించారు. 2023–25 మద్యం పాలసీకి సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేశారు. గౌడ్స్‌కు ఒక షాపు, ఎస్సీలకు ఐదు, ఎస్టీలకు తొమ్మిది కేటాయించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఈ రిజర్వేషన్ షాపుల గుర్తింపునకు సంబంధించి లాటరీ తీసి ఆయా షాప్ నంబర్లను ఖరారు చేశారు. శుక్రవారం డీపీఈవో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాగా, గతేడాది 591 మంది మద్యం షాపుల కోసం టెండర్లు వేయగా, వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.10 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఈసారి దాదాపు 700కు పైగా టెండర్లు వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో పాటు మరికొంత మంది టెండర్లు దక్కించుకునేందుకు ఉవ్విల్లూరుతున్నట్లు సమాచారం. దీంతో ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. వ్యాపారులు ఒక షాపునకు ఎన్ని టెండర్లయినా వేసే అవకాశం ఉంది. అలాగే వేరే షాపులకు టెండర్లు వేసి ఎన్ని లైసెన్స్‌లైనా పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో వ్యాపారులు ఈసారి అధిక సంఖ్యలో దరఖాస్తు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

టెండర్ దక్కించుకున్నాక..

లక్కీడ్రాలో షాపులు దక్కించుకున్న వారు అదేరోజు రెండు నెలలకు సంబంధించి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రెండు సంవత్సరాల పాటు దుకాణం నడిపేందుకు అవకాశం కల్పిస్తారు. రెండేళ్లలో 12 సార్లు, రెండు నెలకోసారి ఎక్సైజ్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. షాపులకు సంబంధించి మూడు స్లాబ్‌లుగా విభజించారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వాటన్నింటికి రూ.65లక్షల స్లాబ్, రూ.55లక్షల స్లాబ్, రూ.50లక్షల స్లాబ్‌లో దుకాణాలకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లాలో 40 మద్యం దుకాణాలు

జిల్లాలో మొత్తం 40 వైన్‌షాపులున్నాయి. ఇందులో 15 రిజర్వ్ కాగా, 25 జనరల్‌కు కేటాయించారు. ఎస్సీలకు రిజర్వ్ చేసిన వాటిలో ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ షాప్ నంబర్–9, వడ్డెర కాలనీ షాప్ నంబర్–10, బేలలోని షాప్ నంబర్–11, భీంపూర్‌లోని షాప్ నంబర్–18, ఇచ్చోడలోని గిర్నూర్ షాప్ నంబర్–29 ఉన్నాయి. గౌడ్స్‌కు ఆదిలాబాద్ పట్టణంలోని షాప్ నంబర్–1 తిర్పెల్లి లక్కీడ్రా రిజర్వ్ అయింది. కాగా, ఉట్నూర్ స్టేషన్ పరిధిలోని తొమ్మిది షాపులు ఎస్టీలకు రిజర్వ్ చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఐఈవో హేమశ్రీ

ఇలా దరఖాస్తు చేయాలి

జిల్లాలోని మద్యం షాపుల టెండర్లకు శుక్రవారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు ఉంది. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు మూడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 11నుంచి సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుదారులు డీడీలు లేదా చలాన్లు చెల్లించి కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది. దరఖాస్తుతో పాటు ఆధార్, పాన్ జిరాక్స్ ప్రతులు, రిజర్వ్ షాపుల కోసం దరఖాస్తు చేసుకునేవారు కులధ్రువీకరణ పత్రాలు, ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వారు ఏజెన్సీ సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు జత చేయాల్సి ఉంటుంది. 21 ఏళ్లు నిండినవారు టెండర్‌లో పాల్గొనవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారికే లక్కీడ్రాలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఎంట్రీ పాస్ ఇచ్చి లోనికి పంపనున్నారు.

మూడు కేంద్రాలు ఏర్పాటు చేశాం

దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో మూడుకేంద్రాలు ఏర్పాటు చేశాం. ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉంది. ఏమైన సందేహాలుంటే హెల్ప్ డెస్క్ 08732–220076 నంబర్‌ను సంప్రదించాలి. ఈనెల 21న ఆదిలాబాద్ పట్టణంలోని రత్న గార్డెన్స్‌లో కలెక్టర్ చేతుల మీదుగా లక్కీడ్రా తీస్తాం. షాపు దక్కించుకున్నవారు 1/6 వంతు చెల్లించాల్సి ఉంటుంది. ఒకరు ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు.

– హేమశ్రీ, డీపీఈవో, ఆదిలాబాద్

ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో గిరిజనుల అభ్యున్నతికి ఐటీడీఏ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై రాయి సెంటర్ల సార్‌మేడిలు, ఆదివాసీ సంఘాలు, ఐటీడీఏ డైరెక్టర్లతో ఆమె సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గిరిజన ప్రజలకు అందేలా కృషి చేస్తానని చెప్పారు. ప్రధానంగా విద్య, వైద్యం అందేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తండాలు, గూడేల్లో ఎలాంటి సమస్యలున్నా సార్‌మేడిలు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు పలువురు ఆయా సమస్యలను సమావేశంలో ప్రాజెక్ట్ అధికారికి తెలియజేశారు. ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ఉమ్మడి జిల్లా సార్‌మేడిలు దుర్గు పటేల్, ప్రభాకర్, మోతీరాం, రాము, ఆదివాసీ సంఘం నాయకులు, సార్‌మేడీలు, ఐటీడీఏ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పిప్పల్‌కోటిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

తాంసి: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులు లబ్ధి పొందాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సూచించారు. శుక్రవారం భీంపూర్ మండలం పిప్పల్‌కోటి శివారులో అధికారులతో కలిసి దళితబస్తీ లబ్ధిదారుల కోసం కేటాయించిన భూములు పరిశీలించారు. మావలకు చెందిన 15మంది లబ్ధిదారుల కోసం కేటాయించిన 58ఎకరాల భూమిని పరిశీలించి లబ్ధిదారులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. దళితబస్తీలో సాగుకు అనుకూలమైన భూములు అందిస్తున్నట్లు తెలిపారు. సాగుభూమితో పాటు సాగునీటి సౌకర్యం, భూముల అభివృద్ధికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తాంసి మండలం బండల్‌నాగాపూర్ మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కల్పిస్తున్న సౌకర్యాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. వానాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు రాంరెడ్డి, డీటీ హరిదాస్, ఆర్‌ఐ అశోక్, ఏవో రవీందర్, ఆర్‌ఐ మల్లేశ్, సర్పంచ్ గంగయ్య, లబ్ధిదారులు తదితరులున్నారు.

వీఆర్‌ఏల సర్దుబాటు

- ఆయా శాఖల్లో 345 మంది కేటాయింపు

ఆదిలాబాద్‌టౌన్: వీఆర్‌ఏలను ఆయా శాఖల్లో సర్దుబాటు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, సబార్డినేట్, మిషన్ భగీరథ, నీటిపారుదల శాఖ, మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్ పోస్టులను విద్యార్హత, సామర్థ్యాల మేరకు కేటాయించినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో 76 మందిని సర్దుబాటు చేయగా, వీరికి వేతనం రూ.24,280 నుంచి రూ.72,850 ఇవ్వనున్నారు. మున్సిపల్ శాఖలో ఏడుగురికి వార్డు ఆఫీసర్ పోస్టులు కేటాయించగా, జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో వీరు పనిచేయనున్నారు. రెవెన్యూ శాఖలో 61 మందికి రికార్డు అసిస్టెంట్‌గా పోస్టింగ్ కల్పించనుండగా, వీరి వేతనం రూ.22,240 నుంచి రూ.67,300 వరకు నిర్ణయించారు. రెవెన్యూ శాఖలో 11మందికి ఆఫీస్ సబార్డినేట్ పోస్టింగ్ ఇవ్వనున్నారు. నీటిపారుదల శాఖలో ఏడుగురు హెల్పర్లు, 81 లస్కర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. మిషన్ భగీరథలో 102 మందికి హెల్పర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీరి వేతనం రూ.19వేల నుంచి రూ.58,850కి నిర్ణయించారు. కాగా, 61ఏళ్లు దాటిన వారి సేవలు కొనసాగించేందుకు గ్రామ సేవకుల కుమార్తె, కుమారులకు ఉద్యోగం కల్పించనున్నారు. జిల్లాలో మొత్తం 345 మంది వీఆర్‌ఏలకు ఆయా శాఖల్లో పోస్టులు కల్పించనున్నారు.

ప్రజల మనోభావాలు దెబ్బతీస్తున్న సర్కార్



సుహాసినిరెడ్డి, నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఆదిలాబాద్: మెజారిటీ ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డి ఆరోపించారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో దళిత యువకుడిపై ఓవర్గం వారు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇదిలా ఉండగా ఇందిరమ్మ కాలనీకి వెళ్లే దారిలో గల పశువధశాలను ఎత్తివేయాలని డిమాండ్ చేసిన నేపథ్యంలో పోలీసులు ఆమెను శుక్రవారం ముందస్తు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తున్నారని, పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం ఆమెతో పాటు పార్టీ నాయకులను రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కొనసాగుతున్న రిమ్స్ కార్మికుల నిరసన



రిమ్స్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రిమ్స్ ఎదుట చేపట్టిన నిరసన కొనసాగుతోంది. శుక్రవారం నాలుగోరోజు నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో ప్రకారం, కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ చేపట్టిన అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించే కాంట్రాక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు సంగీత, ఇక్బాల్, కమలమ్మ, రాజేందర్‌సింగ్, డేవిడ్, లస్మక్క, ఇర్ఫాన్, శ్రీకాంత్, సైఫ్ ఖాన్, నర్సమ్మ, రుక్మిణి, కమలమ్మ, రవీందర్ రాథోడ్, మంగమ్మ, నవీన్, ఖదీర్, ఇమ్రాన్‌ఖాన్ తదితరులున్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాహుల్‌రాజ్



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల తయారీ తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ముందుగా ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా రూపకల్పనపై వారి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర ఓటరు జాబితాను ఈ నెల 21 అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 1,350 కంటే ఎక్కువ ఓటర్లున్న పోలింగ్ కేంద్రం పరిధిలో అదనంగా మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో తొమ్మిది నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాలుగు కేంద్రాలను మరోచోటుకు మార్చినట్లు తెలిపారు. ఓటర్లు వారి పోలింగ్ కేంద్రాన్ని జాబితాలో సరిచూసుకోవాలని సూచించారు. జిల్లాలో 592 పోలింగ్ కేంద్రాలున్నాయని, అందులో ఆదిలాబాద్ నియోజకవర్గంలో 290, బోథ్ నియోజకవర్గంలో 302 ఉన్నాయని తెలిపారు. బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను అందించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు అన్ని పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ తదితరులు పాల్గొన్నారు.

'దత్తత గ్రామంపై సవతి తల్లి ప్రేమ'



లింగాపూర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్

గుడిహత్నూర్: దత్తత గ్రామంపై ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేకపోవడం శోచయమని పేర్కొన్నారు. వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయే వరకు పాలకులు చూస్తూ ఉండడం సరికాదని తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో ప్రతీ పేదోడికి ఇందిరమ్మ ఇల్లు, రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నట్లు గుర్తు చేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మల్యాల కరుణాకర్, ఇచ్చోడ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆసిఫ్‌ఖాన్, నాయకులు నాగ్‌నాథ్ అప్పా, ఆరీఫ్‌ఖాన్, హైమద్‌ఖాన్, విష్ణు పటేల్, గజానంద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈవో ప్రణీత సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) సమావేశానికి హాజరై మాట్లాడారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎస్జీఎఫ్ క్రీడల్లో పాల్గొనేలా కృషి చేయాలన్నారు. కోవిడ్ నేపథ్యంలో మూడేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం పాఠశాల క్రీడలు నిర్వహించనున్నందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి చొప్పదండి కాంతారావు మాట్లాడుతూ.. జిల్లాస్థాయి పోటీలు నిర్వహించే వేదికలు, తేదీలను ఖరారు చేసినట్లు చెప్పారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి మాట్లాడుతూ.. ఎస్జీఎఫ్ క్రీడలు విజయవంతం చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. పెటా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.స్వామి, ఎస్జీఎఫ్ మాజీ కార్యదర్శులు జక్కుల శ్రీనివాస్, గుండి మహేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



మాట్లాడుతున్న డీసీపీవో రాజేంద్ర ప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: బాలల హక్కులను పరిరక్షించాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలసంరక్షణ భవనంలో మాట్లాడారు. బాలలపై జరిగే లైంగిక దాడులను తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఆదిలాబాద్ ఎంపీపీ గంద్రత్ రమేశ్, సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, ఏటీడబ్ల్యూవో నిహారిక, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజలింగం, మహిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఐసీపీఎస్ ఎల్పీవో కుట్ల రమేశ్, స్వామి, వినోద్, రవికాంత్, అశ్విని, ప్రేమేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

400 మందికి నిత్యాన్నదానం


అన్నదాన సత్రంలో భక్తులు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన సత్రంలో భక్తుల సంఖ్య 400లకు పెంచారు. శుక్రవారం నుంచి ప్రతి రోజు 400 మంది భక్తులు ఉచితంగా నిత్య అన్నదానం చేసేలా చర్యలు తీసుకున్నారు. గతంలో ప్రతి రోజు 300 మంది భక్తులకు నిత్య అన్నదానం చేసేవారు. శుక్రవారం నుంచి మరో 100 మంది భక్తులకు అదనంగా అన్నదానం చేయనున్నట్లు ఈవో విజయ రామారావు తెలిపారు.

ఖోఖోలో బంగారు పతకం సాధించిన సాయిరాజ్



పతకంతో సాయిరాజ్

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన సాయిరాజ్ అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో ఇండియా తరఫున పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడు. ఇటీవల నేపాల్ దేశంలో జరిగిన అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో రాణించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో కోచ్ అన్నపూర్ణ, గ్రామస్తులు అతడిని అభినందించారు.

దాడిచేసిన వ్యక్తికి ఏడాది జైలు

జన్నారం: కుదువపెట్టిన బంగారం విషయంలో దాడి చేసిన ఒకరికి ఏడాది జైలుశిక్ష, మరో వ్యక్తికి రూ.2వేల జరిమానా విధిస్తూ లక్సెట్టిపేట్ జూనియర్ సివిల్ జడ్జీ, జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ మహమ్మద్ అసదుల్లా షరీఫ్ తీర్పునిచ్చినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జన్నారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన వొజ్జల లక్ష్మి, రాజన్నల కుమారుడు దామోదర్ అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు బతికున్న సమయంలో అతడి భార్య వొజ్జల సింధూజ బంగారం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో కుదువపెట్టారు. బంగారం విడిపించడానికి డబ్బులు కావాలని 2018 ఆగస్టు 11న సింధూజ, ఆమె తండ్రి దండేపల్లి గ్రామానికి చెందిన బొలిశెట్టి లక్ష్మీనారాయణ, బొలిశెట్టి శివకుమార్, గ్రామ పెద్ద మనిషి ముత్యాల శంకరయ్యలు వొజ్జల లక్ష్మి ఇంటికి వచ్చి లక్ష రూపాయలు ఇవ్వాలని దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితురాలు లక్ష్మి అదేరోజు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో 11మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు. దీంతో శివకుమార్‌కు ఏడాది జైలు శిక్ష ఖరారైంది.

పోక్సో కేసులో ఒకరికి పదేళ్ల జైలు

జైపూర్: పోక్సో కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.7వేలు జరిమాన విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ప్రభాకరరావు శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం... మండలంలోని రామరావ్‌పేటకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కామెర రఘువరణ్ కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడని బాధితురాలి కుటుంబ సభ్యులు 2021 ఫిబ్రవరి 9న జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రఘువరణ్‌పై పోక్సో కేసు నమోదు చేసిన అప్పటి సీఐ బీళ్ల కోటేశ్వర్ రిమాండ్‌కు తరలించి తగిన ఆధారాలతో చార్జిషీట్ దాఖలు చేశాడు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేందర్ ఉపాధ్యాయ 16మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టి విచారణ చేపట్టి నేరం రుజువు చేశాడు. దీంతో పోక్సో కోర్టు ఇన్‌చార్జి కె. ప్రభాకరరావ్ 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.7వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

అప్రమత్తమయ్యేనా..?

- గోదావరి నది పరీవాహకంలో పలు ఘటనలు
- ఎస్సారెస్పీలో గేట్లు ఎత్తడంతో దిగువ ప్రజల ఆందోళన
- సదర్మాట్ వద్ద కొరవడిన రక్షణ చర్యలు
- ప్రకృతి అందాల మాటున మృత్యు పంజా
- విహారయాత్రకు వచ్చి విగతజీవులుగా మారుతున్న వైనం


సదర్మాట్ వద్ద స్నానాలు చేస్తున్న యువకులు (ఫైల్)

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల పరీవాహకంలోని గోదావరి నది ఏగువన ఉన్న ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో దిగువకు వరదనీరు బారీగా వచ్చి గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉత్తరవాహినీ గౌతమి, గోదావరి నది పరీవాహక ప్రాంతంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగం విఫలమవుతోందనే బలమైన ఆరోపణలున్నాయి. దీంతో ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైంది. నది పరీవాహక ప్రాంతంలో ఎక్కడో ఒక చోట ఏదో ఒక సంఘటన చోటుచేసుకోవడం దశాబ్దలుగా పరిపాటిగా మారింది. పలువురు ప్రాణాలతో బయటపడినప్పటికీ మరికొందరు మృతిచెందిన బాధిత కుటుంబాల్లో అంతులేని విషాదం నెలకొంటోంది. దీంతో ప్రజలు వర్షాకాలంలో సదర్మాట్ వెళ్లాలన్నా, గోదావరి నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లాలన్నా.. హడలిపోతున్నారు. గత కొన్నేళ్లుగా వరుసగా జరిగిన సంఘటనల దృష్ట్యా ఇప్పటికైనా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. ప్రకృతి అందాల మాటున మృత్యువును అంచనా వేయక పలువురు విహారయాత్రకు వచ్చి విగతజీవులుగా మారుతున్నారు.

గోదావరికి వెళ్లేది వీరే..

సదర్మాట్‌తో పాటు నది పరీవాహక ప్రాంతాలకు చెందిన ప్రజలు, సందర్శకులు నిత్యం గోదావరి నదిలోకి వెళ్తారు. ప్రధానంగా జాలర్లు, పశువుల కాపర్లు, పర్యాటకులు, కలప స్మగ్లర్లు, రైతులు, గౌడ కులస్తులు, తదితరులు వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటారు. వీరితో పాటు పండుగలు, శుభకార్యాల నిమిత్తం, కొందరు సరదాకోసం మరికొందరు వెళ్తుంటారు. అంతేకాకుండా నది పరిసర గ్రామాల్లో శ్మశానవాటికలు పలుచోట్ల గోదావరి లోపల ఇంకొన్నిచోట్ల ఒడ్డునే ఉండడంతో ఎవరైనా చనిపోతే దహనం, ఖననం చేయడానికి గోదావరికే వెళ్తారు. అక్కడే స్నానాలు ఆచరిస్తారు. పరీవాహక ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే విమర్శలున్నాయి.

నది పరీవాహక గ్రామాలివే..

ఖానాపూర్ మండలంలోని మేడంపల్లి గ్రామం వద్ద గల సదర్మాట్ ప్రాంతం నుంచి వెళ్లే గోదావరి ఖానాపూర్, కడెం, దస్తూరాబాద్ మండలాల్లోని పలు గ్రామాల వెంట వెళ్తోంది. మండలంలోని సదర్మాట్‌తో పాటు ఆయా మండలాల పరిధిలోని సుర్జాపూర్, బాదన్‌కుర్తి, మస్కాపూర్, ఖానాపూర్, దిలావర్‌పూర్, గోడలపంపు, బావాపూర్(కె), లింగాపూర్, ఎల్లగడప, సారంగాపూర్, దిల్‌దార్‌నగర్, బూత్కూరు, గొడిసెర్యాల తదితర గ్రామాలు నది పరీవాహక ప్రాంతంలో ఉంటాయి. ప్రధానంగా సదర్మాట్ ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఇక్కడికి వానాకాలంతో పాటు వేసవికాలంలోనూ అధికసంఖ్యలో వస్తుంటారు.


సదర్మాట్ వద్ద వరద ఉధృతి


సదర్మాట్ వద్ద చేపలు పడుతున్న స్థానికులు (ఫైల్)

సదర్మాట్‌లో చనిపోయిన వారు

- 1995మే నెలలో 10వ తరగతి విద్యార్థులు ఇద్దరు సదర్మాట్‌లో స్నానం చేస్తూ నీటిలో మునిగిపోయారు.
- 1996లో స్వామి నీటిలో మునిగి మృతి చెందాడు
- 1998లో ఆరుగురు విద్యార్థులు చేపలవేటకు వెళ్లారు. ఆ సమయంలో ఎస్సారెస్పీలో 16 గేట్లు ఎత్తారు. దీంతో ముగ్గురు నీటిలో కొట్టుకుపోగా, మరో ముగ్గురు చెట్లకొమ్మలు పట్టుకొని ఉండడంతో వారిని అప్పట్లో హెలికాప్టర్ ద్వారా కాపాడారు.
- 2002లో నిర్మల్‌లోని ఓ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు పిక్నిక్‌కు రాగ, 10తరగతి విద్యార్థి నీటిలో మునిగి చనిపోయాడు.
- 2014 ఆగస్టు 4న ఎండీ జాహెద్ అనే యువకుడు ప్రమాదవశాత్తు సదర్‌మాట్‌లో పడి చనిపోయాడు.
- 2016లో కోరుట్లకు చెందిన విద్యార్థిని అయేషా (12) నీటిలో పడి చనిపోయింది.
- 2017లో నిజామాబాద్‌కు చెందిన శ్రావణ్‌గౌడ్ ఈతకోసం నీటిలోకి దిగి మృతిచెందాడు.
- 2022 మార్చిలో నిర్మల్ పట్టణంలోని కురాన్నపేట్‌కు చెందిన చెందిన తోట లోకేశ్ (22) అమ్మమ్మ ఊరైన ఖానాపూర్‌కు వచ్చి స్నానం చేసేందుకు నీటిలోకి దిగి మృతిచెందాడు.
- 2023లో ఈ నెల17న మెట్‌పల్లికి చెందిన రెహన్(17) నీటిలో దిగి మృతిచెందాడు.
- 12 ఏళ్ల క్రితం బావాపూర్(కె)లో పశువుల కాపర్లు గోదావరి నది కుర్రు(దీవి) ప్రాంతంలో చిక్కుకున్నారు. వారిని యంత్రాంగం వెంటనే ఒడ్డుకు చేర్చలేకపోయింది. దీంతో వారు అక్కడే కొన్ని రోజులు గడిపి నీటి ప్రవాహం తగ్గాక తిరిగి వచ్చారు.
- 7 ఏళ్ల క్రితం మరోసారి బావాపూర్(కె) గ్రామంలో నీటి ప్రవాహంలో పశువులతో పాటు పశువుల కాపర్లు చిక్కుకున్నారు. దీంతో అధికార యంత్రాంగం గజ ఈతగాళ్ల సాయంతో వారిని తిరిగి గ్రామానికి తీసుకువచ్చారు.

పూర్తిస్థాయి రక్షణ చర్యలు చేపట్టాలి

ప్రతీ రోజు పదుల సంఖ్యలో వచ్చే పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సదర్మాట్ వద్ద పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించడంతో పాటు గోదావరి నదిలోకి వెళ్లకుండా పకడ్బందీగా రక్షణ చర్యలు చేపట్టాలి. పర్యాటకులు ఎక్కువగా వచ్చే సమయాల్లోనైనా ఇక్కడ ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. గతంలో అనేక ప్రమాదాలు జరిగిన యంత్రాంగంలో మార్పు లేదు.

– గుగ్లావత్ రాజేందర్‌నాయక్, సర్పంచ్, మేడంపల్లి, ఖానాపూర్

డబ్బులు తీసుకొని పనిచేయడం లేదు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ఆవేదన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధిత మహిళలు

బెజ్జూర్: డబ్బులు తీసుకొని కూడా పనిచేయడం లేదని బెజ్జూర్ మండలం సలుగుపెల్లి గ్రామానికి చెందిన గోవా అమృత, ఆత్రం స్వాతి అనే గిరిజన మహిళలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకే ఇంటికి చెందిన వీరికి సలుగుపెల్లి (ఉత్సరంగాపల్లి) రెవెన్యూ శివారులో భూములు ఉండగా అవి విరాసత్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. రూ.20వేలు లంచం ఇస్తేనే పని చేస్తామని తెలుపడంతో తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి కారు డ్రైవర్‌కు ఆ డబ్బులు ఇచ్చారు. అయినప్పటికీ పని చేయకపోవడంతో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డిని వివరణ కోరగా వారికి సంబంధించిన ఫైల్ ఉన్నతాధికారులకు ఎప్పుడో పంపించామని, నా డ్రైవర్‌కు డబ్బులు ఇవ్వమని నేను చెప్పలేదని, నాకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఇది ఎవరో కావాలనే చేస్తున్నట్లుగా ఉందని తెలిపారు.

గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు


దిమ్మదుర్తిలో ముడిపదార్థాలను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

మామడ: మండలంలోని దిమ్మదుర్తి గ్రామంలో గుడుంబా తయారీ కేంద్రాలపై శుక్రవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గుడుంబా తయారీ కోసం వినియోగించే 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన శివరాత్రి చిన్నరాజన్నపై కేసు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, రషీద్, ముత్యం, ప్రకాష్, వెంకటేష్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

బోథ్: మండలంలోని బాబెరతండాలో గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జాదీవ్ అంబు అలియాస్ బుజ్జి గుడుంబా విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ దాడిలో ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

ముధోల్: ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని చింతకుంట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... లింబన్న–శోభల కూతురు రాణి(17) కళాశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు మందలిండంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరులేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి


ఆశన్న (ఫైల్)

తలమడుగు: మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన రైతు కాకర్ల ఆశన్న(60) పాముకాటుతో శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... ఆశన్న గురువారం పంట పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా రక్తపింజర పాము కాటువేయగా పంట పొలంలో పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రకు చెందిన జాదవ్ వకీల్(40) శుక్రవారం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకాలోని రాజ్‌నాయక్‌తండాకు చెందిన జాదవ్ వకీల్ తన పంట చేనులో పత్తి పంట సాగు చేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి ఏపుగా పెరగడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు గురువారం రాత్రి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అనుమతి వచ్చేనా..?

బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల పేరు శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావనకు వచ్చింది. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులకు తగిన రీతిలో శిక్షణ ఇప్పించడానికి సీవోఈలో లాంగ్ టర్మ్ కోచింగ్‌ను ప్రారంభించడానికి అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రభుత్వాన్ని కోరడం ప్రాధాన్యతను సంతరించుకుంది. లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు అనుమతి ఇవ్వడంతో ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని ఎందరో పేద విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గడానికి దోహదం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- బెల్లంపల్లి సీఓఈలో లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు ఎదురుచూపులు



సీవోఈ కళాశాల భవనం

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) జూనియర్ కళాశాలలో లాంగ్ టర్మ్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించాలనే డిమాండ్ ప్రధానంగా వినబడుతోంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా సీఓఈలో నాణ్యమైన విద్యాబోధన జరుగుతోంది. ఓ వైపు ఇంటర్మీడియట్ విద్యాబోధన చేస్తూనే మరో వైపు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ప్రత్యేకంగా లాంగ్‌టర్మ్ కోచింగ్ లేకపోయినా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులు పోటీపడి చదివి ఉత్తీర్ణత సాధిస్తూ సీవోఈకి వన్నె తెస్తున్నారు. ఉత్తమ ర్యాంకులతో బెల్లంపల్లి సీవోఈ పేరును ఉత్తర తెలంగాణలో మారుమ్రోగిస్తున్నారు. విద్యా సౌరభాలను వెదజల్లుతున్న సీఓఈ కళాశాలలో లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు అవకాశం కల్పిస్తే పేద విద్యార్థుల దశ దిశ మారేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పాఠశాల నుంచి సీవోఈకి ఎదిగి....

2014 జులై 11న బెల్లంపల్లి కేంద్రంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల మంజూరైంది. అదే ఏటా రైల్వే రడగంబాల బస్తీలో ఓ అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య విద్యార్థులకు బోధన ప్రారంభించారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో గురిజాలకు వెళ్లే మార్గంలో ఆధునిక హంగులతో పక్కా భవనాన్ని నిర్మాణం చేసి 2016 జూన్ 6న కొత్త భవనంలోకి మారారు. పదో తరగతి వరకే పరిమితమైన గురుకుల విద్యాలయం 2018లో జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయింది. అదే సంవత్సరం సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జూనియర్ కళాశాలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీగా ప్రకటించింది. 2018–20లో సీవోఈ నుంచి ఇంటర్మీడియట్ మొదటి బ్యాచ్ విద్యార్థులు 63మంది చదువును పూర్తి చేసి బయటకు వెళ్లగా 2019–21లో 65 మంది, 2020–22లో 73 మంది విద్యార్థులు విజయవంతంగా చదువు పూర్తి చేశారు. 2021–23లో నాల్గో బ్యాచ్ విద్యార్థులు 63 మంది పరీక్ష రాసి పాసయ్యారు. బెల్లంపల్లి సీవోఈ విద్యార్థులు ఏటా ఇంటర్మీడియట్‌లో 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తుండగా, వీరిలో సగటున 80 శాతం మంది విద్యార్థులు మాత్రమే సీవోఈ లక్ష్యాలను అందుకుంటున్నారు.

లాంగ్‌టర్మ్ కోచింగ్ హైదరాబాద్‌కే పరిమితం..

సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మెరుగైన విద్యాబోధన కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలను ఏర్పాటు చేసింది. ప్రతి ఉమ్మడి జిల్లాలో బాలబాలికల కోసం వేర్వేరుగా సీఓఈ కళాశాలలను ప్రారంభించగా, వీరికి లాంగ్‌టర్మ్ కోచింగ్ మాత్రం కేవలం హైదరాబాద్ పరిసర ప్రాంతాల సీఓఈల్లో ఇస్తున్నారు. అనేక మంది లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు హైదరాబాద్ వెళ్లలేక ఉన్నత లక్ష్యాలను సాధించడంలో వెనుకకు నెట్టేయబడుతున్నారు.

ఆకర్శిస్తున్న బెల్లంపల్లి సీవోఈ..

ఉత్తమ ఫలితాలతో బెల్లంపల్లి సీవోఈ విద్యార్థుల మదిని దోచుకుంటోంది. ఇక్కడి సీవోఈలో చదవడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యార్థులు సీఓఈ ప్రవేశపరీక్ష రాసి సీటు దక్కించుకుని ప్రథమ ప్రాధాన్యత బెల్లంపల్లి సీవోఈకి ఇచ్చి ప్రవేశం పొందుతున్నారు. అలాంటి బెల్లంపల్లి సీవోఈలో లాంగ్‌టర్మ్ కోచింగ్‌ను ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉత్తర తెలంగాణలో టాప్ బెల్లంపల్లి...


విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు (ఫైల్)

ఉత్తర తెలంగాణలో ఉన్న సంక్షేమ గురుకుల సీఓఈల్లో బెల్లంపల్లి సీఓఈ ఉన్నతంగా రాణిస్తోంది. ఇప్పటి వరకు ఇంటర్మీడియట్ నాలుగు బ్యాచ్‌లు బయటకు వెళ్లి నీట్ పోటీ పరీక్షరాసి 14 మంది విద్యార్థులు మెడిసిన్‌లో సీటు దక్కించుకోగా, జేఈఈ ప్రవేశ పరీక్ష ద్వారా ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీఐ వంటి ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో మరో 14మంది విద్యార్థులు సీటు సాధించారు. ఐకార్, ఐజర్, ఢిల్లీ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీల్లో 18మంది విద్యార్థులు సీటు కైవసం చేసుకుని సత్తా చాటారు. ఇండియన్ నేవీ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ స్పేస్ టెక్నాలజీ వంటి వంటి పలు జాతీయస్థాయి విద్యాలయాల్లో మరో 32మంది సీటు దక్కించుకోవడం విశేషం. వీటితో పాటు ఎంసెట్ ద్వారా జేఎన్‌టీయూ (హెచ్)లో 15మంది, మిగతా పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో 38మంది విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందారు. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుల్లో 12మంది విద్యార్థులు ఉస్మానియా, కాకతీయ, కలింగ, అజీమ్ ప్రేమ్‌జీ వంటి విద్యాసంస్థల్లో సీటు సాధించి బెల్లంపల్లి సీవోఈ ప్రతిష్టను ఇనుమడింపజేశారు.

బెల్లంపల్లికి అవకాశం కల్పించాలి



విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడంలో బెల్లంపల్లి సీఓఈ ప్రత్యేకతను చాటుకుంటోంది. జాతీయస్థాయి పోటీ పరీక్షల కోసం లాంగ్ టర్మ్ కోచింగ్ సౌకర్యాన్ని కల్పించినట్లైతే మరింత రెట్టింపు స్థాయిలో ఫలితాలు వచ్చేందుకు అవకాశాలు మెరుగుపడతాయి. ఎందరో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు అవకాశాలను అందిపుచ్చుకుంటారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని బెల్లంపల్లి సీఓఈలో లాంగ్ టర్మ్ కోచింగ్‌కు అనుమతి ఇవ్వాలి.

– దుగుట శ్రీనివాస్, పేరెంట్, బెల్లంపల్లి

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై రాజేందర్ వివరాల ప్రకారం... ఇర్ఫాన్ అలీ(19) రైళ్లలో సమోసాలు అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. ఐదు నెలల క్రితం షమీణ అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వివాహం అనంతరం సప్తగిరి కాలనీలోని అద్దె ఇంట్లో ఉంటున్నాడు. కొంత కాలంగా సమోసాలు విక్రయించడం మానేసి మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.